# బూచి నన్నొదిలెయ్యవా!

యడవల్లి సుధీర్

కొన్ని వందల కాళ్ళు. నేను లెక్కపెట్టలేనన్ని కాళ్ళు. అవి ఎంతో మంది చిన్న చిన్న పిల్లలవి. వాళ్ళలో నేను కూడా ఉన్నాను. ఎటునించో ఒక సింహం మా మీదికి పరిగెత్తుతూ వస్తోంది. వాళ్ళంతా పరి గెత్తుతున్నారు. నేను మాత్రం వాళ్ళతో పాటు పరిగెత్తలేక పోతున్నాను. సింహం ఒక్కసారిగా నాదగ్గరకు వచ్చేసింది. నాకాళ్ళు ఎవరో కట్టేసినట్టుగా నేను ఒక్కసారిగా 'అమ్మా' అంటూ అరిచాను. అమ్మ నామీద చెయ్యివేసి నన్ను దగ్గరకు తీసుకుంది.

చిన్న చిన్న సైకిళ్ళుతొక్కుతున్న బోలెడంత మంది చిన్నపిల్లలు...ఎగ్జిబిషన్ రైలొచ్చేస్తోంది. పిల్లలందరూ సైకిళ్ళొదిలేసి రైలెక్కేశారు. నేను కూడా రైలెక్కుదామని వస్తున్నాను. ఇంతలో రైలుబయల్దేరి వెళ్ళిపోతోంది. అందరూ ఎక్కేశారు. నేను మాత్రం మిగిలిపోయాను. "నాకు భయం వేస్తోందమ్మా. నాదగ్గరే ఉండవామ్మా" అన్నాను. "అలాగేలేమ్మా" అంటూ అమ్మ నావీపు మీద చెయ్యివేసింది.

అమ్మ చెప్పింది నన్నొక బూచి పట్టుకుందని. అమ్మ ఎప్పుడూ నన్ను "ఈ శని ఈజన్మకి వదలదు" అంటుంది. అమ్మ నన్నెప్పుడూ అలా విసుక్కుంటే నాకెంత ఏడుపొస్తుందో. మెన్న నాకాలు తగిలి గిన్నెలో పాలన్నీ వొలికిపోయాయి. అప్పుడు ఇలాగే అంది అమ్మ. వొలికిపోయిన పాలు చూసుకుంటూ అమ్మ నాకాలి మీద బొబ్బలు చూడనేలేదు.

ఈమధ్య నాకో తమ్ముడు పుట్టాడు. వాడెంత బావున్నాడో! ఎంత ముద్దొస్తున్నాడో!! అయినా అమ్మ, నాన్న నన్నువాడి దగ్గిరికే వెళ్ళనివ్వటం లేదు. నన్ను పట్టుకున్న 'బూచి' వాడ్నికూడా పట్టుకుంటుందని వాళ్ళ భయంట అమ్మమ్మ చెప్పింది.

బడిలో కూడా ఇంతే. ఎవ్వరూ దగ్గరకు రానివ్వరు. బడి అయిపోయాక వాళ్ళంతా ఎంచక్కా ఫుట్‌బాల్ ఆట ఆడుకుంటుంటే నాకూ అలా చెయ్యాలని ఉంటుంది.

నాన్న నన్నెంతమంది దగ్గరకు తీసుకెళ్ళాడో. అయినా నన్నీ బూచి వదలటం లేదు.

ఈజన్మలో దేముడికి బాగా దణ్ణం పెట్టు





17-10-86 ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక

కుంటే వచ్చేజన్మలోనైనా ఈబూచినన్నొదిలి వెళ్ళిపోతుందని బామ్మ చెప్పింది.

కానీ నాకు ఇప్పుడే పరిగెత్తాలని ఉంది. అందుకే ఇప్పుడే ఇంకో జన్మరావాలంటే ఏం చెయ్యాలి? అప్పుడు తాతయ్య చచ్చిపోతే ఇంకో జన్మ ఎత్తుతాడని పక్కింటి అత్తయ్యగార న్నారుగా. అంటే ఇంకో జన్మరావాలంటే చచ్చిపోవాలన్నమాట. కానీ చచ్చిపోవాలంటే ఏం చెయ్యాలి? అసలు చచ్చిపోవడమంటే ఏమిటి? మొన్న చూసిన సినిమాలో ఒకమ్మాయి పరిగెత్తుకెళ్ళి రైలుపట్టాల మీద పడుకుంటే మీదనించి రైలెళ్ళిపోయింది. అప్పుడు అందరూ ఆ అమ్మాయి చచ్చిపోయిందన్నారుగా. అంటే చచ్చిపోవాలంటే రైలు పట్టాల మీద పడుకోవాలన్నమాట. అవును ఈబూచి నన్నొదిలి పోవాలంటే చచ్చిపోవాల్సిందే.

ఒక్కసారి ఎలాగోలా చచ్చిపోతే ఇంకో జన్మవస్తుందిగా.

అప్పుడునన్ని బూచి వదిలేస్తుందిగా. ఆ తరువాత పరిగెత్తుకుంటూ ఇంటికొచ్చేసి




తమ్ముడితో ఆడుకోవచ్చు.

రైలుపట్టాలు ఇంటికి దగ్గర్లోనే ఉన్నాయిగా. అయినా అక్కడికెళ్ళటం ఎలా?

అబ్బ ఈదారంతా బాగాలేదు. ఎన్ని ముళ్ళున్నాయో. కాళ్ళూచేతులూ గీసుకు పోతున్నాయి. రక్తం కూడా వస్తోంది. అమ్మో! ఎంత నెప్పిగా ఉందో. అబ్బా! రాళ్ళు కూడా కొట్టుకుంటున్నాయి.

అమ్మయ్య! దగ్గిరి కొచ్చేశాయి పట్టాలు. సినిమాలోనేమో రైలు వెంటనే వచ్చేసిందే. ఇప్పుడు ఎంతసేపటికీ రాదేం?

ఆ అదిగో వచ్చేస్తోంది రైలు. అమ్మో ఎంత పెద్ద ఇంజనో. దగ్గర కొస్తుంటే ఎంత భయం వేస్తోందో. కళ్ళు మూసుకుంటే భయం పోతుంది.

ఎలాగోలా చచ్చిపోతే ఇంకో జన్మవస్తేఈ బూచి వదిలేస్తుందిగా. అప్పుడు కూడా ఈ బూచి పట్టుకోకుండా ఉండాలంటే బాగా దణ్ణం పెట్టుకోవాలి. రైలు దగ్గర కొచ్చేస్తోంది. తొందరగాదణ్ణం పెట్టుకోవాలి. "బూచీ! నన్నొదిలెయ్యవూ!" "బూచీ!! నన్నొది లెయ్యవూ బూచీ నన్నొది లెయ్యవూ. బూచీ నన్నొది. ."

(మనదేశంలో ఏటా సుమారు 7 లక్షల మంది పిల్లలు 'పోలియో' వాతపడుతున్నారని ఒక అంచనా.)


అక్టోబరు 15 విడుదల

మల్లాది వెంకట కృష్ణమూర్తి

రాక్షస సంహారం

శ్రీ మహాలక్ష్మి బుక్ ఎంటర్ ప్రైజెస్

మ్యూజియం రోడ్, విజయవాడ - 2

కేవలం రూ.450 చెల్లించి
గోవెల్ మిక్చర్ గ్రైండర్
తీసుకొని వెళ్లండి!
మిగిలినది సులభ వాయిదాలలో...
* శక్తివంతమైన 500W. మోటారు
* 3 స్టెయిన్‌లెస్ స్టీలు జార్లు
* తక్షణ సర్వీసు సదుపాయం
* 2 సంవత్సరముల గ్యారంటీ మరియు జీవితకాలం ఉచిత సర్వీసు!




డీలర్సు:-

సోనోవిజన్
ఏలూరు రోడ్, విజయవాడ-2.